మెయిన్

# టీ-మీడియా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక : 146
పేజీలు : 3

శనివారం 20 డిసెంబర్, 2025

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

మండల / నియోజక వర్గం / జిల్లా స్థాయి విలేకరులు / మార్కెటింగ్
ఏజెంట్లు కావలెను
కేంద్రప్రభుత్వ డిజిటల్ మీడియా (2021) గైడ్ లైన్స్‌కి లోబడి నిర్వహణలో ఉన్న జీఎస్టీ లైసెన్స్ కలిగిన టీమీడియా (డిజిటల్) లో పని చేయడానికి మండల / నియోజక వర్గం / జిల్లా స్థాయి విలేకరులు / మార్కెటింగ్ ఏజెంట్లు కావలెను.
అనుభవం ఉన్న వారికీ ప్రాధాన్యత, కొత్త వారికీ అవకాశం కలదు.
వివరాలకు కోసం : 8919710365, 7382990365, 8498972434 కాల్ / మెసెజ్ చేయండి.
GSTIN:36FDKPS1308P1ZX
టీ-మీడియా
సామాజికం ... ప్రజల పక్షం...
Spot Speed NEWS
epaper,www.tmedia.net.in YouTube facebook

# కేంద్రమంత్రులతో సీఎం చంద్రబాబు భేటీ



## పథకాలకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి

**టి మీడియా, డిసెంబర్ 19 , అమరావతి :**

దిల్లీ పర్యటనలో సీఎం చంద్రబాబు బిజీబిజీగా ఉన్నారు. గురువారం రాత్రి దిల్లీకి చేరుకున్న చంద్రబాబు ఈ క్రమంలో ఆయన ముందుగా కేంద్ర జల్‌శక్తిశాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో సమావేశమయ్యారు. ఆ తర్వాత కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్?తో భేటీ అయ్యారు. ఆపై మంత్రులు సర్బానంద సోనోవాల్, మనోహర్‌లాల్ ఖట్టర్, బీజేపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నబీన్‌ను కలిశారు

**ఏపీ అభివృద్ధికి సహకరించాలి**

కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమైన చంద్రబాబు బృందం పూర్వోదయ, సాస్కీ పథకాల ద్వారా నిధులు అందించి ఏపీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని, పోలవరం-నల్లమల సాగర్ ప్రాజెక్టుకు చేయూత అందించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో మూడు వర్కింగ్ ఉమెన్ హాస్టళ్ల నిర్మాణాల పూర్తికి నిధులివ్వాలన్నారు. సాస్కీ కింద రెండో విడత రూ.10,054 కోట్ల నిధులు మంజూరు చేయాలని, మౌలిక సదుపాయాల నిర్మాణానికి నిధులు కీలకమన్నారు.

**నిధులు కీలకం**

రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు రూ.41 వేల కోట్ల ఆర్థిక సహకారం అవసరమని, కేంద్ర బడ్జెట్‌లో రాయలసీమ హార్టికల్చర్ డెవలప్‌మెంట్ ప్యాకేజీ ప్రకటించాలని ప్రతిపాదించారు. పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టును 3 దశలుగా చేపట్టేందుకు అయ్యే వ్యయాన్ని వివరిస్తూ ఆర్థికమంత్రికి సీఎం లేఖ అందించారు. ప్రాజెక్టును చేపట్టేందుకు ఇప్పటికే జలహారతి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రాథమిక ప్రాజెక్టు రిపోర్టును కూడా కేంద్ర జలశక్తి శాఖకు సమర్పించినట్లు తెలిపారు.

**కేంద్ర జల్‌శక్తిశాఖ మంత్రితో సీఎం చంద్రబాబు**

కేంద్ర జలశక్తి మంత్రితో చర్చలో భాగంగా ఆయన పోలవరం సహా రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన అనుమతులు, వివిధ పథకాలకు నిధుల విడుదల గురించి మాట్లాడారు. ప్రత్యేకించి విభజన హామీల్లో భాగంగా ఆమోదం పొందిన ప్రాజెక్టులకు తక్షణమే ఆర్థిక సాయం అందించాలని, పెండింగ్ అంశాలపై ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించాలని కోరారు.

**అదనంగా రూ.1,000 కోట్ల ప్రతిపాదన**

రాష్ట్రానికి నీటి భద్రత అత్యంత కీలక అంశమని రాష్ట్రంలో సాగు, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని కేంద్రం సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టులపై కేంద్ర-రాష్ట్ర సమన్వయం మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి జల్ జీవన్ మిషన్ అమలు కోసం రాష్ట్రానికి అదనంగా రూ.1,000 కోట్లు కేటాయించాలని సీఎం కోరారు. రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.524.41 కోట్లు ఖర్చు చేశామని దీనికి సంబంధించిన కేంద్ర వాటా నిధులను కూడా విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. సీఎం వెంట కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఏపీ మంత్రులు నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్, పలువురు ఎంపీలు ఉన్నారు.

**షిప్‌బిల్డింగ్ రంగం బలోపేతం**

కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలరవాణా, ఆయుష్ శాఖల మంత్రి సర్బానంద సోనోవాల్‌ను కలిసిన సీఎం చంద్రబాబు దుగరాజపట్నం షిప్‌బిల్డింగ్ క్లస్టర్, ఫిషింగ్ హార్బర్లకు కేంద్ర సాయంపై చర్చించారు. 'చిప్ టు షిప్' విజన్‌కు అనుగుణంగా షిప్‌బిల్డింగ్ రంగం బలోపేతం చేయాలని వినతి పత్రం అందజేశారు. దుగరాజపట్నంలో నేషనల్ మెగా షిప్‌బిల్డింగ్, షిప్ రిపేర్ క్లస్టర్ అభివృద్ధికి సహకరించాలని, దాని ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సన్నద్ధంగా ఉన్నామన్నారు.

**సోనోవాల్‌ను కలిసిన సీఎం చంద్రబాబు**

ఈ ప్రాజెక్టు కోసం 3,488 ఎకరాల భూమి సమకూర్చేందుకు అంగీకారం లభించిందన్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన టెక్నో ఎకనామిక్ ఫీజిబిలిటీ రిపోర్ట్ సిద్ధమైందన్నారు. ఫేజ్-1లో చేపట్టిన 4 ఫిషింగ్ హార్బర్లకు అదనపు నిధులు కేటాయించాలని కోరారు. జువ్వలదిన్నె హార్బర్‌కు మాత్రమే కేంద్రం నుంచి రూ.138.29 కోట్లు మంజూరయ్యాయని వెల్లడించారు. ఇప్పటివరకు



రాష్ట్ర ప్రభుత్వం రూ.782.29 కోట్లు ఖర్చు చేసిందని వివరించారు. మిగిలిన మూడు హార్బర్లకు కేంద్ర సాయం ఇంకా అందలేదన్నారు. ఫేజ్-1 పూర్తి కోసం ఇంకా రూ.440.91 కోట్లు అవసరం ఉందని తెలిపారు. వాడరేవు ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి, సహా సాగరమాల పథకం కింద రూ.150 కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. మొత్తం రూ.590.91 కోట్లు కేంద్రం నుంచి సహాయంగా అందాల్సి ఉందని విరించారు.

**కేంద్ర మంత్రి మనోహర్? లాల్? ఖట్టర్?తో సీఎం**

అనంతరం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో సీఎం భేటీ అయ్యారు. విశాఖ, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టులు ఆమోదించాలని కోరారు. సవరించిన డీపీఆర్‌లను కేంద్రం ఆమోదానికి పంపినట్లు చంద్రబాబు తెలిపారు. విశాఖ, విజయవాడలో మెట్రో రైలు ఆవశ్యకతను కేంద్రమంత్రికి వివరించారు.

**హరిదీప్‌సింగ్ పురితో సీఎం చంద్రబాబు**

కేంద్ర పెట్రోలియం మంత్రి హరదీప్‌సింగ్ పురితో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. ఈక్రమంలో నెల్లూరు జిల్లాలో బీపీసీఎల్ గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ శంకుస్థాపనకు ఆహ్వానించారు. అది రూ.96,862 కోట్ల పెట్టుబడితో అతిపెద్ద ఇంధన ప్రాజెక్టుగా నిలుస్తుందని వివరించారి. దానికోసం రాష్ట్రం ఇప్పటికే 6 వేల ఎకరాలు, ప్రోత్సాహకాలు ప్రకటించిందన్న చంద్రబాబు తెలిపారు. ప్రాజెక్టుకు సంబంధించిన పబ్లిక్ హియరింగ్ విజయవంతంగా పూర్తయ్యిందని, పర్యావరణ అనుమతులు కూడా త్వరలోనే రానున్నాయన్నారు. ప్రాజెక్ట్ అన్ని దశల్లో వేగంగా ముందుకు సాగుతోందని, ఈ ప్రాజెక్ట్ ద్వారా ఉద్యోగావకాశాలు, పారిశ్రామిక అభివృద్ధి, రాష్ట్ర ఆర్థిక వృద్ధికి గణనీయమైన తోడ్పాటు లభించనుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

**టీడీపీ ఎంపీలతో సీఎం చర్చ**

రాష్ట్రంలో చేపడుతున్న సంక్షేమ పథకాల విషయంలో జగన్‌కి ఎదురుదెబ్బలే ఎక్కువగా తగులుతున్నాయని ఏపీ సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. దిల్లీ పర్యటనలో ఉన్న ఆయన రాష్ట్రానికి చెందిన కూటమి ఎంపీలతో సమావేశమయ్యారు. టీడీపీ పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో సుమారు 40 నిమిషాల పాటు వివిధ అంశాలపై వారితో మాట్లాడారు.ఒక్క వైద్య కళాశాలల పీపీపీ వ్యవహారం మాత్రమే వైఎస్సార్సీపీకి దొరికిందన్నారు. ఆ విషయంలో కూడా ప్రజలు వాళ్లకి అవకాశం ఇవ్వలేదని, కోటి సంతకాల పేరుతో డ్రామా చేయాలని జగన్ చూశారని ధ్వజమెత్తారు. కానీ అది కూడా ఫెయిలైందని, దిల్లీ స్థాయిలోనూ పీపీపీ విధానంపై ఎంపీలు అధ్యయనం చేయాలని చంద్రబాబు సూచించారు. ప్రస్తుతం దిల్లీ, గుజరాత్ రాష్ట్రాల్లో పీపీపీ పద్ధతిలో ఆస్పత్రులు నడుస్తున్న విషయాన్ని పలువురు ఎంపీలు సీఎంకు వివరించారు. మనకు గుర్తింపు పెరుగుతున్న కొద్దీ బాధ్యత ఎక్కువ అవుతుందని చంద్రబాబు అన్నారు. మరింత బాధ్యతతో పని చేయాల్సిన అవసరముందని చెప్పారు.

# ఎక్స్‌లో మోదీ మార్క్

## టాప్ 10 లైక్డ్ ట్వీట్లలో

**టి మీడియా, డిసెంబర్ 19 , న్యూఢిల్లీ :**

గత 30 రోజులుగా సోషల్ మీడియా ప్లాట్?ఫామ్ ఎక్స్?లో ప్రధాని నరేంద్ర మోదీ పోస్టులు భారీ స్థాయిలో స్పందన పొందుతున్నాయి. భారత్‌లో అత్యధికంగా లైక్స్ వచ్చిన టాప్ 10 ట్వీట్లలో ఎనిమిది ట్వీట్లు ప్రధాని మోదీ ఖాతా నుంచే రావడం విశేషం. ఎక్స్ తాజాగా తీసుకొచ్చిన మోస్ట్ లైక్డ్ ఫీచర్ ప్రకారం, ఆ జాబితాలో మోదీ తప్ప మరే ఇతర రాజకీయ నేత పోస్టులు చోటు దక్కించుకోలేకపోయాయి.

**పుతిన్?కు భగవద్గీత అందించిన ట్వీట్ టాప్**

ఆ జాబితాలో అత్యధిక లైక్స్ సాధించిన ట్వీట్ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు ప్రధాని మోదీ భగవద్గీత ప్రతిని బహూకరించిన సందర్భానికి సంబంధించినది. భారత్ పర్యటనలో భాగంగా పుతిన్‌కు గీతను అందజేస్తూ మోదీ చేసిన ఈ పోస్ట్‌కు ఏకంగా 6.7 మిలియన్ రీచ్, 2.31 లక్షల లైక్స్ వచ్చాయి. "రష్యన్ భాషలో భగవద్గీత ప్రతిని అధ్యక్షుడు పుతిన్‌కు అందించాను. గీత బోధనలు ప్రపంచవ్యాప్తంగా కోట్ల మందికి ప్రేరణనిస్తాయి" అని ప్రధాని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు.

**పుతిన్‌కు దిల్లీకి స్వాగతించిన వేళ**

అదే విధంగా, పుతిన్‌ను దిల్లీకి స్వాగతిస్తూ ప్రధాని చేసిన మరో ట్వీట్ కూడా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ట్వీట్‌కు 10.6 మిలియన్ రీచ్, 2.14 లక్షల లైక్స్ లభించాయి. "నా మిత్రుడు, అధ్యక్షుడు పుతిన్‌ను భారత్‌కు స్వాగతించడం ఆనందంగా ఉంది. ఈ రోజు, రేపు జరిగే చర్చల కోసం ఎదురుచూస్తున్నాను. ఇండియా%-%రష్యా స్నేహం కాల పరీక్షను తట్టుకుని ప్రజలకు ఎంతో మేలు చేసింది" అని మోదీ



పేర్కొన్నారు.

**అయోధ్యలో ధ్వజారోహణ ఉత్సవం**

ఇక అయోధ్య శ్రీరామ జన్మభూమి ఆలయంలో జరిగిన ధ్వజారోహణ ఉత్సవంపై ప్రధాని చేసిన ట్వీట్ కూడా విశేష స్పందన దక్కించుకుంది. ఈ పోస్ట్‌కు 3.1 మిలియన్ రీచ్, 1.40 లక్షల లైక్స్ వచ్చాయి. "శ్రీరామ జన్మభూమి మందిరంలో ధర్మ ధ్వజారోహణ ఉత్సవాన్ని చూడటం కోట్ల మంది ఎదురుచూసిన క్షణం. అయోధ్యలో చరిత్ర సృష్టించబడింది. ఇది ప్రభు శ్రీరాముడు చూపిన మార్గంలో ముందుకు సాగేందుకు మరింత ప్రేరణనిస్తుంది" అని ప్రధాని పేర్కొన్నారు.

**అభినందన ట్వీట్ కూడా టాప్ 10లో**

అదే విధంగా, ఇండియన్ బ్లైండ్ మహిళల క్రికెట్ జట్టు తొలి బ్లైండ్ మహిళల టీ20 ప్రపంచకప్ గెలుచుకున్న సందర్భంగా ప్రధాని చేసిన అభినందన ట్వీట్ కూడా టాప్ 10లో చోటు దక్కించుకుంది. ఈ పోస్ట్‌కు 5.5 మిలియన్ రీచ్, 1.47 లక్షల లైక్స్ వచ్చాయి. "తొలి బ్లైండ్ మహిళల టీ20 వరల్డ్‌కప్‌ను గెలిచి చరిత్ర సృష్టించిన భారత బ్లైండ్ మహిళల క్రికెట్ జట్టుకు అభినందనలు. సిరీస్‌లో ఓటమి లేకుండా నిలవడం మరింత ప్రశంసనీయం. ఇది కష్టపడి సాధించిన గొప్ప విజయానికి నిదర్శనం" అని మోదీ కొనియాడారు. వీటితోపాటు మరికొన్ని ట్వీట్లు కూడా ఉన్నాయి.

**29కు చేరిన పురస్కారాల సంఖ్య**

ఇదిలా ఉండగా, ప్రధాని నరేంద్ర మోదీ జోర్డాన్, ఇథియోపియా, ఒమన్ దేశాల పర్యటన ఇటీవల ముగించుకుని దిల్లీ వచ్చారు. ఆ సమయంలో రెండు దేశాల నుంచి అత్యున్నత పౌర పురస్కారాలు అందుకున్నరు. దీంతో ప్రధాని మోదీకి లభించిన విదేశీ అత్యున్నత పౌర పురస్కారాల సంఖ్య 29కు చేరింది. ఇది ఆయన వ్యక్తిగత దౌత్యనైపుణ్యానికి, అంతర్జాతీయ వేదికపై భారత్?కు పెరుగుతున్న ప్రభావానికి నిదర్శనంగా నిలుస్తోంది.ఇప్పటి వరకు మోదీ ఇథియోపియా 'గ్రేట్ హానర్ నిషాన్ ఆఫ్ ఇథియోపియా', నమీబియా- 'ఆర్డర్ ఆఫ్ ది మోస్ట్ ఏన్షియంట్ వెల్విట్షియా మిరబిలిస్', బ్రెజిల్- 'గ్రాండ్కాలర్ ఆఫ్ ది నేషనల్ ఆర్డర్ ఆఫ్ ది సదర్న్ క్రాస్', ట్రినిడాడ్ అండ్ టొబాగో- 'ఆర్డర్ ఆఫ్ ది రిపబ్లిక్', ఫ్రాన్స్- 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ది లెజియన్ ఆఫ్ ఆనర్', రష్యా- 'ఆర్డర్ ఆఫ్ సెయింట్ ఆండ్రూ ది అపోస్టల్', అమెరికా- 'లెజియన్ ఆఫ్ మెరిట్', సౌదీ అరేబియా- 'ఆర్డర్ ఆఫ్ కింగ్ అబ్దుల్ అజీజ్', యూఏఈ- 'ఆర్డర్ ఆఫ్ జాయెద్', ఈజిప్ట్- 'ఆర్డర్ ఆఫ్ ది నైల్', భూటాన్- 'ఆర్డర్ ఆఫ్ ది డ్రుక్ గ్యాల్పో', శ్రీలంక- 'మిత్ర విభూషణ', పాలస్తీనా, అఫ్గానిస్థాన్, కువైట్, మాల్దీవులు, సహా అనేక దేశాల నుంచి పురస్కారాలు అందుకున్నారు.

# గ్యాప్ తర్వాత కారెక్కనున్న కేసీఆర్..



తెలంగాణ భవన్‌కు గులాబీ బాస్..!

3లో..



# ముగిసిన శీతాకాల సమావేశాలు..

**పార్లమెంట్ ఉభయసభలు నిరవధిక వాయిదా**

**టి మీడియా, డిసెంబర్ 19 , న్యూఢిల్లీ:**

పార్లమెంట్శీతాకాల సమావేశాలు ముగిశాయి. ఇవాళ లోక్‌సభ, రాజ్యసభ నిరవధికంగా వాయిదా పడ్డాయి. వీబీ జీ రామ్ జీ బిల్లుకు వ్యతిరేకంగా లోక్‌సభలో విపక్షాలు ఆందోళన చేపట్టాయి. అయితే ప్రశ్నోత్తరాల సమయానికి అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో స్పీకర్ ఓం బిర్లా సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. చివరి రోజు సభకు ప్రధాని మోదీ హాజరయ్యారు. మన్రేగా స్థానంలో కేంద్ర ప్రభుత్వం జీ రామ్ జీ బిల్లును తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ఆ బిల్లును వ్యతిరేకిస్తూ గురువారం విపక్షాలు ఆందోళన చేపట్టాయి. బిల్లు ప్రతులను చింపి, నినాదాలు చేశాయి. మూజువాణి ఓటు ద్వారా రాజ్యసభలోనూ ఆ బిల్లు పాసైంది.మరో వైపు జీరామ్‌జీ బిల్లును వ్యతిరేకిస్తూ పార్లమెంట్ ఆవరణలో రాత్రంతా టీఎంసీ ఎంపీలు ధర్నా చేపట్టారు. ఆ బిల్లుపై రెండు సభల్లోనూ ఎటువంటి చర్చ చేపట్టలేదని, బుల్డోజ్ చేశారని టీఎంసీ ఎంపీలు ఆరోపించారు. సంవిదాన్ సదన్ గేటు వద్ద తృణమూల్ ఎంపీలు ధర్నా చేపట్టారు. గాంధీ,ఠాగూర్ ఫోటోలు ఉన్న బ్యానర్లను ప్రదర్శించారు. తృణమూల్ ఎంపీలు 12 గంటల ధర్నా చేపట్టారని, అర్ధరాత్రి ధర్నా స్టార్ట్ చేశామని, ఇవాళ మధ్యాహ్నం వరకు తాము ధర్నా చేయనున్నట్లు టీఎంసీ నేత సాగరికా ఘోష్ తెలిపారు. మోదీ సర్కారు బుల్డోజ్ చర్యలకు పాల్పడుతున్నట్లు ఎంపీ సాగరిక ఆరోపించారు.రాజ్యసభను కూడా ఇవాళ నిరవధికంగా వాయిదా వేశారు. ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ మాట్లాడుతూ 269వ రాజ్యసభ సమావేశాలు ముగిసినట్లు వెల్లడించారు. తనను రాజ్యసభ చైర్మెన్‌గా ఎంపిక చేసినందుకు సభ్యులకు ఆయన థ్యాంక్స్ తెలిపారు. సభా కార్యక్రమాలు జరిగిన తీరు పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. మునుముందు కూడా ఇలాగే సభ కొనసాగుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. జీరో అవర్, క్వశ్చన్ అవర్ చాలా ప్రయోజనకరంగా జరిగినట్లు సీపీ రాధాకృష్ణన్ తెలిపారు.

# తీవ్ర కాలుష్యంతో ఢిల్లీ ఉక్కిరిబిక్కిరి..

- 150 విమానాలు రద్దు

**టి మీడియా, డిసెంబర్ 19 , న్యూఢిల్లీ :**

దేశ రాజధాని ఢిల్లీని వాయు కాలుష్యం ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. శుక్రవారం ఉదయం గాలి నాణ్యత సూచిక 380కి పడిపోయింది. తీవ్ర కాలుష్యంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలుష్యానికి తోడు నగరాన్ని దట్టమైన పొగమంచు కమ్మేసింది. దీంతో విజిబిలిటీ దారుణంగా పడిపోయింది. ఫలితంగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.దృశ్యమానత పడిపోవడంతో ఇవాళ ఉదయం ఢిల్లీకి రాకపోకలు సాగించే దాదాపు 152 విమానాలు రద్దయ్యాయి. వాటిలో 79 డిపార్చర్స్ కాగా, 73 అరైవల్స్ ఉన్నాయి. మరికొన్ని విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. దీంతో ప్రయాణికులకు ఢిల్లీ

మిగతా 3లో..



# రేషన్ కట్...అనేది ఉండదు

- ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- స్పష్టం చేసిన పౌరసరఫరాల శాఖ కమిషనర్ రవీంద్ర



**టి మీడియా, డిసెంబర్ 19 , హైదరాబాద్ :**

తెలంగాణ రాష్ట్రంలో రేషన్ కార్డు లబ్ధిదారుల మధ్య గత కొన్ని రోజులుగా జరుగుతున్న ప్రచారానికి పౌరసరఫరాల శాఖ తెరదించింది. ఈ నెల 31లోగా (ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్) పూర్తి చేయకపోతే ప్రభుత్వం పంపిణీ చేయనున్న 'సన్నబియ్యం' నిలిపివేస్తారనే వార్తలు సోషల్ మీడియాలో విపరీతంగా వ్యాపించాయి. నేపథ్యంలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ రవీంద్ర స్పందిస్తూ.. అభ్యర్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, బియ్యం పంపిణీని నిలిపివేసే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని స్పష్టమైన వివరణ ఇచ్చారు.

**ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్ ప్రక్రియ అనేది**

ప్రక్రియ అనేది రేషన్ కార్డులో ఉన్న లబ్ధిదారుల వివరాలను ధృవీకరించుకోవడానికి చేసే ఒక ప్రామాణిక చర్య అని అధికారులు తెలిపారు. కార్డులో పేరు ఉన్న ప్రతి ఒక్కరు కనీసం ఒక్కసారైనా రేషన్ దుకాణానికి వెళ్లి తమ వేలిముద్రలు లేదా కనుపాప గుర్తులను నమోదు చేయాల్సి ఉంటుంది. అయితే, దీనికి సంబంధించి ప్రభుత్వం ఎలాంటి తుది గడువు విధించలేదని కమిషనర్ స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి పథకాలు అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, ఎవరినీ రేషన్ కు దూరం చేసే ఉద్దేశం లేదని ఆయన పేర్కొన్నారు.

### ఇబ్బందులు తలెత్తకుండా

భవిష్యత్తులో రేషన్ పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలంటే ఈ ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్ ప్రక్రియ పూర్తి చేయడం మేలని ప్రభుత్వం సూచిస్తోంది. ముఖ్యంగా అనర్హుల పేర్లను తొలగించడానికి, అలాగే కార్డులో ఉండి చనిపోయిన వారి పేర్లను గుర్తించడానికి ఈ ప్రక్రియ దోహదపడుతుంది. లబ్ధిదారులు ఆందోళనతో రేషన్ షాపుల వద్ద గుమికూడకుండా, తమకు వీలైన సమయంలో వెళ్లి ఈ వివరాలను అప్‌డేట్ చేసుకోవచ్చని పౌరసరఫరాల శాఖ తెలిపింది. ప్రభుత్వ అధికారిక ప్రకటనలతో క్షేత్రస్థాయిలో ఉన్న అయోమయం తొలగిపోయినట్లయింది.



## గాయత్రి సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం

**టీ మీడియా, డిసెంబర్ 19, పెద్దపల్లి:**

పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో గాయత్రి సేవా సమితి ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. అమావాస్య అన్న ప్రసాదం కార్యక్రమంలో శుక్రవారం అమావాస్యలో భాగంగా 30వ మాసాన్ని పురస్కరించుకుని.దాతలు అల్లె%శీ%కి ఆంజనేయులు - ధనలక్ష్మి కుటుంబ సభ్యుల
గౌరిశెట్టి భూమయ్య - పద్మ కుటుంబ సభ్యులుకోరిక మేరకు ,గత 29 నెలల నుండి దాతల సహకారంతో విజయవంతంగా అన్నప్రసాద వితరణ కార్యక్రమం కొనసాగుతుందని వ్యవస్థాపక అధ్యక్షులు కాసనగొట్టు వినయ్ తెలిపారు. ఈకార్యక్రమంలో సెక్రటరీ రావికంటి రాజు, ఉపాధ్యక్షులు చిట్టి మల్ల రవి,కోశాధికారి కటకం సత్యనారాయణ,జాయింట్ సెక్రటరీ నాగమల్ల శ్రీనివాస్ మరియు సభ్యులు బొల్లం ఆంజనేయులు,గౌరిశెట్టి సాయి శివ, సంతోష్, గుండ సాయి వర్మ, పైడావిజయ్ ,ముస్త్యాల ప్రదీప్, భాస్కర్ ,బొల్లం శ్రీనివాస్, పాల్గొన్నారు.

## శబరిమలలో బంగారం చోరీ కేసు

- ఈడీకి దర్యాప్తునకు కోర్టు ఆదేశం





**టి మీడియా, డిసెంబర్ 19 , శబరిమల:**

శబరిమల బంగారు చోరీ కేసులో కొల్లం విజిలెన్స్ కోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. బంగారు దోపిడీపై దర్యాప్తు చేయడానికి కొల్లం విజిలెన్స్ కోర్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి అనుమతి ఇచ్చింది. ఈ కేసుకు సంబంధించిన అన్ని పత్రాలను ఈడీకి అప్పగించాలని కోర్టు ప్రత్యేక దర్యాప్తు బృందం ని ఆదేశించింది. ఇప్పటివరకు నమోదైన రెండు ఎఫ్ఐఆర్ కాపీలు, నిందితులకు సంబంధించిన రిమాండ్ రిపోర్టులు సహా ఇతర కీలక దస్త్రాలను ఈడీకి తక్షణమే ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశించింది. ఈ కేసులో ఈడీ త్వరలో మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద కేసు నమోదుచేయనుందని తెలిసింది. శబరిమల ఆలయంలోని దేవుడి విగ్రహాల బంగారు తాపడం బరువులో వ్యత్యాసంపై దర్యాప్తు చేపట్టేందుకు కేరళ ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా సిట్ ఏడుగురిని అరెస్టు చేసింది. అయితే మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేపట్టేందుకు అనుమతించాలని కోరుతూ ఈడీ తొలుత కేరళ హైకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు సూచన మేరకు కొల్లాం విజిలెన్స్ కోర్టులో పిటిషన్ వేయగా, ఈడీ విజ్ఞప్తిని సిట్ వ్యతిరేకించింది. ఒకేసారి రెండూ కొనసాగడం దర్యాప్తును ప్రభావితం చేస్తాయని అభిప్రాయపడింది. సిట్ వాదనలను తిరస్కరించిన కొల్లాం విజిలెన్స్ కోర్టు, ఈడీ విచారణకు అనుమతిచ్చింది.

## యూట్యూబర్ నివాసంపై ఈడీ దాడులు




**టి మీడియా, డిసెంబర్ 19 ,న్యూఢిల్లీ:**

అక్రమ ఆన్‌లైన్ బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌లతో ముడిపడి ఉన్న మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా ఉత్తరప్రదేశ్‌కు చెందిన యూట్యూబర్ అనురాగ్ ద్వివేది ఉన్నావ్ నివాసంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాడులు నిర్వహించింది. లంబోర్గిని ఉరుస్, బీఎండబ్ల్యూ జెడ్-4, మెర్సిడెస్-బెంజ్‌తో సహా నాలుగు లగ్జరీ వాహనాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.ద్వివేది ఆదాయంలో ఎక్కువ భాగం భారతదేశంలో చట్టవిరుద్ధమైన స్కై ఎక్స్ఛేంజ్, ఇతర బెట్టింగ్ యాప్‌ల వంటి ప్లాట్‌ఫారమ్‌లను ప్రోత్సహించడం, నిధుల బదిలీల కోసం డిజిటల్ ఛానెల్‌లను ఉపయోగించడం ద్వారా వచ్చినట్లు వర్గాలు సూచిస్తున్నాయి. ద్వివేది అనుబంధ సంస్థగా వ్యవహరించాడని, తన యూట్యూబ్ ఫాలోయింగ్‌ను ఉపయోగించి వినియోగదారులను ఈ యాప్‌లకు మళ్లించాడని ఆరోపించారు. కొనుగోలు చేయడానికి, విలాసవంతమైన జీవనశైలికి నిధులు సమకూర్చడానికి ఖాతాలు, సంస్థల ద్వారా ప్రమోషన్ ఆదాయాలను అక్రమంగా మార్చారా అని పీఎంఎల్ఏ నమోదు చేయబడిన కేసును ఈడీ పరిశీలిస్తుంది. పీఎంఎల్ఏ ఆస్తుల అటాచ్‌మెంట్, సంక్లిష్ట లావాదేవీలను ట్రాక్ చేయడానికి అనుమతిస్తుంది. ఈ చర్య అక్రమ బెట్టింగ్‌కు సహాయం చేసే ప్రభావశీలులను లక్ష్యంగా చేసుకుంది. అధికారులు బ్యాంక్ రికార్డులు, చెల్లింపు డేటా, నెట్‌వర్క్ లింక్‌లను విశ్లేషిస్తున్నారని, ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోందని ఈడీ అధికారులు వెల్లడించారు.



## కాంగ్రెస్ నుండి బిఆర్ఎస్‌లో వలసలు

**టీ మీడియా, డిసెంబర్ 19, చిన్న చింతకుంట:**

మహబూబ్నగర్ జిల్లా దేవర్కద్ర నియోజకవర్గం చిన్న చింతకుంట మండలం అమ్మాపూర్ గ్రామం కాంగ్రెస్ పార్టీ నుండి మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలోకి భారీగా అన్నసాగర్ గ్రామంలో చేరికలు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సోహెబ్ ఉరహమాన్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వలియొద్దీన్ కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన వార్డ్ మెంబర్లు2 వ వార్డ్ మెంబర్ అలివేలు రాములు,3 వ వార్డ్ మెంబర్ శారద కురుమూర్తి, 4 వ వార్డ్ మెంబర్ పారిజాత నాగరాజు, 8 వ వార్డ్ మెంబర్ మహేందర్.10 వ వార్డ్ మెంబర్ గోవర్ధన్. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకటన్న వీరితో పాటు దాదాపు 100 మంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా పార్టీ లో పాత కొత్త అని తేడా లేకుండా అందరూ కలిసికట్టుగా ఉండాలని సూచించారు.



## కాంగ్రెస్‌కు భారీ షాక్

- రాంపూర్ లో కాంగ్రెస్‌కు మూకుమ్మడి రాజీనామా

**టీ మీడియా ,డిసెంబర్ 19, నర్వ :**

నారాయణపేట జిల్లా నర్వ మండలంలోని రాంపూర్ లో కాంగ్రెస్‌కు భారీ షాక్ తగిలింది. రాంపూర్ గ్రామ మైనార్టీ అధ్యక్షుడు చిన్న బడ్ స్సా అలాగే గ్రామంలో కొందరు శుక్రవారం భారీ ఎత్తున కాంగ్రెస్ నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ పార్టీ లలిత గౌడ్ ఆధ్వర్యంలో సుమారు 20 మంది నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. రాంపూర్ గ్రామ అధ్యక్షుడు మున్నూరు నర్సింహా అధ్యక్షతన జరిగిన సమావేశానికి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహేశ్వర్ రెడ్డి, విండో వైస్ చైర్మన్ లక్ష్మన్న, మండల నాయకులు దండు అయ్యప్ప, మాజీ ఎంపీపీ వినవతి శంకర్, వెంకటేష్, అనంత్ రెడ్డి, శంకర్, వెంకటేష్, శంకర్ హాజరై కాంగ్రెస్ నాయకులకు గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

## సర్పంచ్, వార్డు మెంబర్లకు మాజీ మంత్రి కొప్పుల సన్మానం

**టీ మీడియా,డిసెంబర్ 19,ఎండపల్లి,**



గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన ఎండపల్లి గ్రామ సర్పంచ్,వార్డు మెంబర్లను మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్మండ లకేంద్రంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో గ్రామ పంచాయతీ ఎన్నికలు చాలా ముఖ్యమైనవని అన్నారు.ప్రజా మద్దతుతో గెలిచిన ప్రజా ప్రతినిధులు గ్రామాల అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని కోరారు.గ్రామ స్థాయిలో ప్రజల సమస్యలనుపరిష్కరించడంలో సర్పంచ్‌లు, వార్డుమెంబర్లపాత్ర ఎంతోకీలకమైనది. పల్లెలప్రగతి కోసంప్రభుత్వం అందించేనిధులను సక్రమంగా వినియోగించుకొని, గ్రామాలను అభివృద్ధిచేయాలి. మీకునాసంపూర్ణ సహకారంఎల్లప్పుడూ ఉంటుంది.అని ఆయనహామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలోగెలుపొంది నసర్పంచ్‌లు, వార్డుమెంబర్లకు శాలువాలుకప్పి, జ్ఞాపికలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్మారం సునీతజెలందర్రెడ్డి, రాయిల్లనాగరాజు, గణేష్,రాజు, భూసారపుచక్రి ,శ్రీనివాస్,దేవి మహేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఒకే స్కూల్ - ఒకే వృత్తి

## సర్పంచిలుగా మారిన ఆటో డ్రైవర్లు

**టి మీడియా, డిసెంబర్ 19 , ఆదిలాబాద్ :**

వారిద్దరూ బాల్య స్నేహితులు. చిన్నప్పటి నుంచి ఒకే దగ్గర చదువుకున్నారు. ఇలా పదో తరగతి వరకు ఒకేచోట చదివారు. ఆ తర్వాత కుటుంబ పోషణకు ఇద్దరూ ఒకే రకమైన వృత్తిని ఎంచుకున్నారు. ఆటో డ్రైవర్లుగా అందరి మన్ననలు పొందారు. ఇప్పుడు ఆ బాల్య మిత్రులు తమ తమ గ్రామాల్లో పంచాయతీ సర్పంచులుగా పోటీ చేశారు. అనూహ్యంగా విజయం సాధించారు. ఇక్కడ విచిత్రం ఏంటంటే, వారిద్దరికీ ఒకే రకమైన మెజార్టీ రావడం.ఆదిలాబాద్? జిల్లా తాంసి మండలం పొన్నారికి చెందిన తలారి భూమన్న, అలాగే ఆదిలాబాద్? మండలం పొచ్చరకు చెందిన కడదరపు గంగన్న బాల్య స్నేహితులు. వీరిద్దరి మండలాలు వేరైనా పక్క పక్క గ్రామాలే. ఇద్దరూ పొచ్చర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోనే పదో తరగతి వరకూ చదువుకున్నారు. ఇద్దరూ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. అందరితో కలుపుగోలుగా ఉంటూ, తమ తమ గ్రామాల్లో ప్రజల అభిమానాన్ని పొందుతున్నారు.పంచాయతీ ఎన్నికల్లో పొన్నారి, పొచ్చర పంచాయతీ సర్పంచ్ స్థానాలు ఎస్సీ జనరల్?కు కేటాయించడంతో ఇద్దరూ సర్పంచులుగా పోటీలో నిలిచారు. ఈ నెల 14వ తేదీన వెలువడిన పొన్నారి పంచాయతీ ఫలితాల్లో తలారి భూమన్న సమీప ప్రత్యర్థిపై 43 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. అదేవిధంగా ఈ నెల 17వ తేదీన వెలువడిన ఫలితాల్లో పొచ్చర సర్పంచిగా కడదరపు గంగన్న సరిగ్గా 43 ఓట్ల మెజారిటీతోనే గెలుపొందడం ఇక్కడ విశేషం. ఇద్దరూ ఒకేలా మెజారిటీ సాధించడంతో స్నేహితులిద్దరి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి.



**మేరీ పంచాయత్ యాప్‌లో ఫిర్యాదు చేయండి**

గ్రామ పంచాయతీ ఎన్నికలు ముగిశాయి. నేటి నుంచి గ్రామాల పాలన బాధ్యత సర్పంచులు, వార్డు సభ్యులదే. పల్లెలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రూపాల్లో నిధులు మంజూరు చేస్తుంటాయి. వాటిని వేటికి ఖర్చు చేయాలి? ఏ అభివృద్ధి పనులు చేపట్టాలి? తదితర వాటిని పర్యవేక్షించాల్సిన బాధ్యత ఇక గ్రామ పాలకులదే. అయితే పలుచోట్ల నిధుల విషయంలో అక్రమాలు చోటుచేసుకున్నాయి. దీనికి అడ్డుకట్ట వేయడంతో పాటు పాలన పారదర్శకంగా సాగుతుందా లేదా అని తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం మేరీ పంచాయత్? యాప్?ను అందుబాటులోకి తీసుకువచ్చింది.

**మేరీ పంచాయత్ యాప్‌లో ఏమేం ఉంటాయంటే**

స్మార్ట్?ఫోన్?లో ప్లేస్టోర్? ద్వారా మేరీ పంచాయత్? యాప్?ను డౌన్?లోడ్? చేసుకోవాలి.పేరు, ఫోన్? నంబరు వివరాలతో లాగిన్? కావాలి.రాష్ట్రం, జిల్లా, మండలం, గ్రామ పంచాయతీ వివరాలు ఎంటర్? చేయాలి.ఇలా ఎంటర్? చేసిన తర్వాత క్లిక్? చేస్తే ఆ పల్లెకు సంబంధించిన నిధుల వివరాలు, వార్డుల వారీగా ఖర్చులు, చేపట్టిన పనుల చిత్రాలు వంటివి కనిపిస్తాయి.గ్రామ పంచాయతీకి మంజూరైన నిధులు, వాటితో చేపట్టిన పనుల వివరాలను చిత్రాలతో సహా అధికారులు యాప్?లో విధిగా అప్?లోడ్? చేస్తారు. ఆస్తులు, పాలకవర్గం, ఆదాయ వివరాలు, పంచాయతీ కార్యదర్శి, అధికారుల వివరాలు జియో ట్యాగింగ్ ద్వారా అందులోనే ఉంటాయి. ఎక్కడెక్కడ అభివృద్ధి పనులు చేపట్టారనేది ఈ యాప్?లో తెలుసుకోవచ్చు.

### ఫిర్యాదులు, సలహాలు

ఆర్థిక సంఘం ఎన్ని నిధులు వేసింది. ఇంకా రావాల్సినవి ఏవైనా నిధులు ఉన్నాయా? వంటి వివరాలు ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకోవచ్చు. దీంతో పాలకవర్గాలు పొరపాట్లకు తావివ్వకుండా ప్రతి పైసా లెక్క ప్రకారం ఖర్చు చేసే అవకాశం ఉంటుంది. తప్పుడు లెక్కలు చూపితే పౌరులు ప్రశ్నించి సమాచారాన్ని చూసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసే అవకాశం ఉంటుంది. మరోవైపు గ్రామాభివృద్ధికి అవసరమైన సలహాలు, సూచనలు అందించే అవకాశం ఈ యాప్? ద్వారా పౌరులకు లభించనుంది.



## సర్పంచ్ అయిన డాక్టరమ్మ

**టి మీడియా, డిసెంబర్ 19 వనపర్తి :**

ఈ రోజుల్లో యువత అనగానే చదువు, ఉపాధి, ఉద్యోగం పేరుతో పట్టణాలకే పరుగులు పెడుతున్నారు. అక్కడే స్థిరపడిపోయి గ్రామాల వైపు కనీసం తొంగి చూడడం లేదు. మహా అయితే పండుగలు, శుభకార్యాలకు అలా వచ్చి.. ఇలా వెళ్ళిపోతున్నారు. రాష్ట్రంలో చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఇక రాజకీయాలకు అయితే చాలా దూరంగా ఉంటున్నారు. ఇలాంటి సందర్భంలో ఇటీవలే ముగిసిన పంచాయతీ ఎన్నికలు కొంత మార్పును తీసుకువచ్చాయి. రిజర్వేషన్లు, గ్రామ అభివృద్ధి కోసం సర్పంచ్ ఎన్నికల బరిలో నిలిచి గెలిచారు.
వనపర్తి జిల్లాలో ఒక ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థిని ఎన్నికల బరిలో నిలిచి అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. అంతే కాదు ఎన్నికలలో మంచి మెజారిటీ తో గెలిచి నిలిచింది. పెబ్బేరు మండలం శాఖాపూర్(వై) గ్రామానికి చెందిన యువతి కేఎన్ నిఖిత సర్పంచ్‌గా ఎన్నికైంది. వాస్తవంగా నిఖిత ప్రస్తుతం నాగర్ కర్నూల్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతోంది. నిఖిత తండ్రి రాజేంద్ర ప్రసాద్ డిప్యూటీ తహసిల్దార్‌గా, తల్లి చిలకమ్మ టీచర్‌గా పనిచేస్తున్నారు. చిన్న వయసులోనే అందులో వైద్య వృత్తి ఎంచుకొని సర్పంచ్ స్థానానికి పోటీ చేయడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది.గ్రామంలో ఉన్న యువత ఉద్యోగాలు, ఉపాధి అంటూ వెళ్తే.. ఊరిని ఎవరు ఉద్ధరిస్తారని ప్రశ్నించి బరిలో నిలిచింది నిఖిత. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు, అధికార పార్టీ మద్దతుతో సర్పంచ్‌గా విజయం సాధించింది. ఇక సర్పంచ్‌గా గ్రామ అభివృద్ధిపై ఫోకస్ పెడతానని నిఖిత చెబుతోంది. ప్రధానంగా డ్రైనేజ్, తాగునీటి సరఫరా, రవాణా సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపింది. అటు వైద్య విద్య, ఇటు సర్పంచ్ పదవి రెండు సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని ధీమా వ్యక్తం చేసింది.



## ట్రాక్టర్‌ను ఢీకొన్న బైక్

### అక్కడికక్కడే ఒకరు మృతి

**టి మీడియా, డిసెంబర్ 19 , కుమ్రం భీం ఆసిఫాబాద్:**

ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి 'కొతారి గ్రామ సమీపంలో శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది.స్థానికుల వివరాల ప్రకారం కొతారి గ్రామానికి చెందిన మహేష్(18),జ్యోతిరామ్ ధనురా గ్రామం నుండి ఆసిఫాబాద్ వైపు ద్విచక్ర వాహనంపై వెళు తున్నారు.పత్తిలోడుతో వెళుతున్న ట్రాక్టర్ వెనుక భాగంలో బైక్ కొట్టడంతో ద్విచక్ర వాహనంపై ఉన్న మహేష్ అక్కడికక్కడే మృతి చెందగా జ్యోతిరామ్ కు తీవ్ర గాయాలు అయ్యాయి దీంతో వెంటనే జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.ప్రమాద విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.మహేష్ మృతి చెందిన విషయం తెలుసుకున్న బంధువులు సంఘటన స్థలానికి చేరుకున్నారు.కుటుంబ సభ్యులు, బంధువుల రోధనలు మిన్నంటాయి.

